

సత్వర పరిష్కారం చూపుదాం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జగనన్నకు చెబుదాం – స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపేలా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం నాడు స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి 280 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం – స్పందన అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలన్నారు. స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్‌ఒ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, డీఆర్డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రబీ ఆశలు ఆవిరి..!

◆ పప్పుశనగ సాగుకు ముగుస్తున్న సమయం ◆ ఐదు శాతంలోపే సాగు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్‌లో మొదలైన వర్షాభావం రబీలోనూ కొనసాగుతోంది. వర్షాభావం అక్టోబర్ నెలలోనూ నెలకొనడంతో రబీ సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తక్కువ విస్తీర్ణంలోనే రబీ సాగు అవుతున్నప్పటికీ నల్లరేగడి నెలల్లో పప్పుశనగ ప్రధానంగా సాగయ్యేది. ఈ పంట సాగుకు అక్టోబరు ఆఖరుకే కీలకమైన సమయం. నవంబరు మొదటి వారం దాటితే అంత అనువైన సమయం కాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు. ఇప్పటి వరకు చినుకు జాడ లేకపోవడంతో ఇకపై రబీ సాగు ముందుకు సాగే అవకాశాలు కనిపించడం లేదు.

ఐదు శాతంలోపే సాగు

అనంతపురం జిల్లా పరిధిలో రబీలో 3.04 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ఇందులో ప్రధానంగా 1.93 లక్షల ఎకరాల్లో పప్పుశనగ పంట సాగవుతుంది. ఆ తరువాత స్థానం వేరుశనగ పంటది ఉంటుంది. అది కూడా బోరు బావుల కింద ఇతర పంటలు సాగవుతాయి. కాని ఇప్పటి వరకు చూస్తే కేవలం 16,600 ఎకరాల్లో మాత్రమే పప్పుశనగ పంట సాగైంది. అంటే సాధరణంలో ఐదు శాతం మాత్రమే విత్తనం పడింది. వేరుశనగ అయితే 50 వేల ఎకరాల్లో సాధారణ సాగు కాగా, ఇప్పటి వరకు ఒక్క ఎకరంలోనూ విత్తనం పడలేదు. ఇక సత్యసాయి జిల్లాలో రబీ సాధారణ సాగు 69వేల ఎకరాలు. ఇందులో ఇక్కడ ప్రధానంగా వేరుశనగ పంటయే రబీలో సాగవుతుంది. 43 వేల ఎకరాలు సాధారణ వేరుశగయే ఉంటుంది. వర్షాల్లేక భూగర్భ జలాలు తగ్గిపోయే సూచనలు కనిపిస్తుండటంతో ఇక్కడా వేరుశనగ సాగు చేయాలా.. వద్దా అన్న మీమాంస రైతుల్లో నెలకొంది. సత్యసాయి జిల్లాలో రబీ పూర్తిగా ఎత్తిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అక్టోబర్‌లోనూ వర్షాభావమే

రబీ పంటల సాగుకు కీలకమైంది అక్టోబరు మాసం. ఈ మాసంలోనూ అటు అనంతపురం, ఇటు సత్యసాయి జిల్లా రెండు చోట్లా తీవ్ర వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో అక్టోబర్ మాసంలో సాధారణ వర్షపాతం 98 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 6.4 మిల్లీమీటర్ల మాత్రమే నమోదయ్యింది. సత్యసాయి జిల్లాలో 115.2 మిల్లీమీటర్లకుగానూ 2.2 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. జూన్ నుంచి ఇప్పటి వరకు చూస్తే అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 417.7 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 253.8 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యింది. సాధారణం కంటే 39.2 శాతం తక్కువ వర్షపాతం ఈ ఏడాది నమోదయ్యింది. సత్యసాయి జిల్లాలో 471.7 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతానికిగానూ 299.2 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయ్యింది. 33.6 శాతం ఈ ఏడాది వర్షపాతలోటుంది. రెండు జిల్లాల పరిధిలోనూ అటు ఆరు మండలాలు, ఇటు ఆరు మండలాల్లో మినహా తక్కిన అన్ని మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఖరీఫ్ పంటలు ఇప్పటికే పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో ఈ ఏడాది రబీ ఆశలు కూడా సీజన్ ప్రారంభంలోనే ఆవిరయ్యే సూచనలు కనిపిస్తుండటం రైతులను దిక్కుతోచని స్థితిలోకి పడేస్తోంది.

ప్రజల్లోకి 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ'

3న చెన్నేకొత్తపల్లిలో యాత్ర ప్రారంభం
మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



పరిటాల సునీత

రాప్తాడు నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి సంబంధించి మాజీ మంత్రి పరిటాల సునీత రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. నవంబర్ మూడవ తేదీ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి అనంతపురంలోని తన నివాసంలో అనంతపురం, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల నాయకులతో సోమవారం నాడు సమావేశం నిర్వహించారు. ఏఏ రోజు ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్నది నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. 4, 5వ తేదీల్లో అనంతపురం రూరల్ పరిధిలోని ఆకుతోటపల్లిలో కార్యక్రమం ఉంటుందన్నారు. 6, 7 తేదీల్లో ఆత్మకూరు మండలంలో 8, 9 తేదీల్లో రాప్తాడు మండలాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా చంద్రబాబు సూపర్ సిక్స్ అనే అద్భుతమైన పథకాలను తీసుకొచ్చారన్నారు. టిడిపికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార వైసిపి చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి టిడిపి ఆరు పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే అవినీతి అక్రమాలు, భూదందాలు, వైఫల్యాలనూ ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి కూడా ప్రజలందరికీ తెలియజేయాలన్నారు.



దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రైతులు అధైర్యపడొద్దని తాము అండగా ఉండి ఆదుకుంటామని స్థానిక ఎమ్మెల్యే రేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భరోసానిచ్చారు. సోమవారం మండల పరిధిలోని పోతుల నాగేపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలలో వర్షాభావంతో ఎండిన వేరుశనగ, కంది పంటపొలాలను పరిశీలించారు. వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవక పోవడంతో వేరుశనగ పంట ఎండిపోయిందని, పశువులకు మేత ఉండాలని తొలగిస్తున్నామని చెప్పారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి స్పందిస్తూ పంటనష్టానికి సంబందించిన సమగ్ర నివేదికను సత్వరం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పంటనష్టం నివేదికను అధికారులు పూర్తి చేసిన తర్వాత రైతులకు న్యాయం జరిగేలాగా పరిహారం వీలైనంత ఎక్కువ అందించేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డితో చర్చిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, వైస్ ఎంపీపీ రావులచెరువు ప్రతాప్ రెడ్డి, మండల కన్వీనర్ పోతుకుంట రామయ్య, మండల వ్యవసాయ సంఘం అధ్యక్షులు మాలగుండ్లపల్లి కేశవరెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, పోతిరెడ్డి, రవీంద్రారెడ్డి.శివారెడ్డి, నర్సిరెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల నిరసనాగ్రహం

◆ సిపిఎం ఆధ్వర్యంలో పెనుకొండ ఎమ్మెల్యే ఇంటి ముట్టడి
◆ ఇళ్ల పట్టాలు ఇవ్వమంటే గుడిసెలు కూల్చేయడంపై ఆగ్రహం
◆ అడ్డుకున్న పోలీసులు, పలువురి అరెస్టు
◆ పెనుగులాటలో నాయకులకు అస్వస్థత



ఎమ్మెల్యే ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న మహిళలు



సిపిఎం నాయకున్ని బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -పెనుకొండ

ఇళ్ల పట్టాల కోసం పెనుకొండలో పేదలు పెద్ద ఎత్తున నిరసనాగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి సొంతిళ్లు లేక అవస్థలు పడుతున్న తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ గత కొన్ని రోజులుగా సిపిఎం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పెనుకొండ పట్టణం మడకశిర రోడ్డులోని ప్రభుత్వం స్థలంలో ఇటీవల భూ స్వాధీన పోరాటం నిర్వహించి అందులో గుడిసెలు వేసుకున్నారు. ఈ గుడిసెలను నాలుగు రోజుల క్రితం రెవెన్యూ, పోలీస్ అధికారులు జెసిబిలతో తొలగించారు. దీనిని నిరసిస్తూ పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ ఇంటి ముట్టడికి సిపిఎం పిలుపునిచ్చింది. అందులో భాగంగా సోమవారం ఉదయం పెద్ద సంఖ్యలో పేదలు ఎమ్మెల్యే శంకర్ నారాయణ ఇంటిని ముట్టడించారు. ఇంటి ప్రధాన గేటుకు వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రెవెన్యూ, పోలీసు అధికారులు జెసిబిలతో గుడిసెలను తొలగించడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై ఎమ్మెల్యే సమాధానం ఇవ్వాలని నినాదాలు చేస్తూ ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆందోళన విషయం తెలుసుకున్న పెనుకొండ సిఐ రాజా రమేష్, ఎస్ఐ రాజేష్, రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళనను విరమించాలని కోరారు. ఇళ్లు లేకుండా నిరాశ్రయిలుగా ఉన్న తమకు ఇంటి స్థలం ఇవ్వమని అడిగితే ఇలా గుడిసెలు కూల్చేయడం ఏమిటంటూ పోలీసులను పేదలు ప్రశ్నించారు. తమకు ఇళ్ల పట్టాలు ఇస్తేనే ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు.

బలవంతపు అరెస్టులు.. సిపిఎం నాయకులకు అస్వస్థత

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలు, సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. తాము ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరిస్తామని చెప్పినా వినకుండా అరెస్టులకు ఉపక్రమించారు. ఏకపక్షంగా పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని ఇష్టారీతిన ఈడ్చుకుంటూ వెళ్లి అరెస్టులు చేశారు. మహిళలు అని చూడకుండా వారిపై ప్రతాపం చూపారు. బలవంతపు అరెస్టును ఎదుర్కొనే క్రమంలో తోపులాట జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నారాయణ, తిప్పన్న, సిపిఎం నాయకులు కొండా వెంకటేష్ తదితరులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో మహిళలు వలయంగా ఏర్పడి వారిని అరెస్టు చేయనీయకుండా అడ్డుపడ్డారు. దీంతో పోలీసులు కొంచెంసేపు ఆగారు. తరువాత సిపిఎం, వ్యకాసం నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్నను అరెస్ట్ చేసి రొద్దం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిపిఎం నాయకులు గంగాధర్, వెంకటరాముడులను పెద్ద సంఖ్యలో పోలీసులు చుట్టుముట్టి అరెస్టు చేసేందుకు యత్నించారు. ఈసమయంలో నాయకులు గంగాధర్, వెంకటరాముడులు స్పృహ తప్పి అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన నాయకులను మహిళలు చికిత్స నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇక రొద్దం పోలీసు స్టేషన్‌లో ఉన్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న కూడా తీవ్ర అస్వస్థతకు గురై కళ్లు తిరిగి కిందపడ్డాడు. వెంటనే ఆయన్ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏళ్ల తరబడి అడుగుతున్నా స్పందించడం లేదు.. మహిళల ఆవేదన

ఇళ్ల పట్టాల కోసం ఏళ్ల తరబడి అధికారులు, నాయకులను అడుగుతున్నా వారి నుంచి స్పందన కరువైందని పేద మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం అధికారులు, పెనుకొండ ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చామన్నారు. వారి నుంచి స్పందన రాకపోవడంతో భూస్వాధీన ఉద్యమం నిర్వహించి మడకశిర రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్నామన్నారు. ప్రభుత్వ భూమిలో పట్టాలు ఇవ్వమని అడిగితే దాని గురించి వారు పట్టించుకోలేదన్నారు. తాము ఎంతో కష్టపడి వేసుకున్న గుడిసెలను సైతం రెవెన్యూ, పోలీసులు అధికారులు కూల్చి వేసి నిలువనీడ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం పేదల గురించి మాట్లాడే ప్రజా ప్రతినిధులకు తమ గృహ కష్టాలు కన్పించడం లేదాని ప్రశ్నించారు. తాము గుడిసెలు వేసుకున్న స్థలంలో ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడంతో స్పృహ తప్పి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న



పోలీసుల పెనుగులాటలో స్పృహ తప్పి కిందపడిపోయిన సిపిఎం నాయకులు

లేపాక్షి ఎస్ఐగా గోపి

లేపాక్షి :



మండల నూతన ఎస్ఐగా గోపి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎస్ఐ బదిలీపై వెళ్లగా గోపీ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డు కట్ట వేస్తామన్నారు. కర్నాకటక మద్యం రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా శాంతి భద్రతలను కాపాడుతామని తెలిపారు. నూతన ఎస్ఐకి సిబ్బంది సాదర స్వాగతం పలికారు.

పంటకోత ప్రయోగం

లేపాక్షి : మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటలో సోమవారం వ్యవసాయ అధికారులు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. అందులో భాగంగా రైతు గోపాలప్ప పొలంలో 15–15 మీటర్ల విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 0.530 కిలోల దిగుబడి వచ్చిందని మండల వ్యవసాయ అధికారిణి శ్రీలత తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పుష్ప, తిరుమలేష్, రఘు, రైతులు పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగాలు చేస్తున్న అధికారులు

జాగ్రత్తలతో మలేరియా నివారణ

ప్రజాశక్తి-మడకశిర



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు

సరిహద్దు ప్రాంతాల్లో మలేరియా వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు సూచించారు. పట్టణంలో సోమవారం తాలూకా పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అనంతపురం జిల్లా మలేరియా యూనిట్ అధికారి కుళ్లాయప్పనాయక్, అసిస్టెంట్ అధికారి లక్ష్మీనాయక్, పెను కొండ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ మంజువాణి హాజరయ్యారు. డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ సరిహద్దు గ్రామాల్లో మలేరియా వ్యాపించకుండా జాగ్రత్తలు, వలస కార్మికుల విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించేలా, నిల్వ ఉన్న నీటిలో లార్వాను నియంత్రించడంపై ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. జ్వరం కేసులకు రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు షమీవుల్లా, శివన్న, రమణ, సూపర్‌వైజర్ రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'శాశ్వత భూహక్కు భూరక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

'జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష' కార్యక్రమన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ సుభద్రనాగేంద్ర సూచించారు. పట్టణంలోని సచివాలయం వద్ద సోమవారం కౌన్సిలర్ ఆధ్వర్యంలో 'జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లడుతూ సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేదల ఇళ్లు, భూములను సర్వే చేసి లబ్ధిదారులకు రిజిస్టర్ డాక్యుమెంట్స్ అందజేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఎఇ మురళీ, ఛైర్మన్ తనయుడు జయరాజ్, జెసిఎస్ కన్వీనర్ విక్రమ్, సచివాలయ కన్వీనర్లు అంజలి, గోపి, రాజశేఖర్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ చెస్ పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి



పూజిత

ధర్మవరం టౌన్ : సౌత్ జోన్(సౌత్ ఇండియా) అంతర్ విశ్వవిద్యాలయాల చెస్ పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి పూజిత ఎంపికైందని బీఎస్కే చెస్ అకాడమి కోచ్‌లు ఆదిరత్నకుమార్, కిషోర్‌కుమార్ తెలిపారు. రెండురోజుల క్రితం నెల్లూరు జిల్లా కావలిలో జేఎన్టీయు అనంతపురం పరిధిలో గల కళాశాలలకు అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలు నిర్వహించగా అందులో క్రీడాకారిణి పూజిత ప్రతిభ కనపర్చిందన్నారు. నవంబర్ రెండో వారంలో తమిళనాడులో సౌత్ జోన్ చెస్ పోటీల్లో ఆమె పాల్గొంటుందని చెప్పారు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు విద్యార్థిని ఎంపిక

ధర్మవరం టౌన్ : విజయవాడలో కేఎల్ యూనివర్సిటీలో నవంబరు 1నుండి 10వతేదీ వరకు జరగనున్న ఎన్ఎస్ఎస్ వెస్ట్రన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొనేం దుకు తమ కళాశాల విద్యార్థిని ఎంపికైందని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తమ కళాశాలలో బీకాం ద్వితీయసంవత్సరం చదువుతున్న మద్దన శ్రావణి ప్రీ పెరేడ్లో అత్యుతమ ప్రతిభ కనబరచి 2024 జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్రదినోత్సవం పరేడ్లో పాల్గొనేందుకు ఎంపికైందని ఆయన తెలిపారు. దీంతో విద్యార్థిని శ్రావణిని సోమవారం కళాశాలలో ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ త్రివేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, అధ్యాపకులు చిట్టెమ్మ, షమీవుల్లా, కిరణ్ కుమార్, పావని, భువనేశ్వరి, ఆనందక్ష, హేమావతి, స్వామి తదితరులు అభినందించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 'ఓపెన్ హౌస్'

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



పోలీసుల ఆయుధాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవరణంలో సోమవారం ఓపెన్ హౌస్ (ఆయుధాల ప్రదర్శన), సాంకేతిక పరమైన వస్తువుల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఈనెల 21 నుండి 31 వరకు ఎస్పీ శ్రీ ఎస్వీ మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీసులు కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు .అందులో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్(ఆయుధాల ప్రదర్శన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల ఆయుధాలు, పోలీసు పరికరాలు, వాటి పని తీరు గురించి జిల్లా ఎస్పీ విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఆనంతరం ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆకట్టుకున్న డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు

ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా డాగ్ స్క్వాడ్ ప్రదర్శన ఆకట్టుకుంది. సంఘటనలు జరిగినప్పుడు ఆనవాళ్లను ఏ విధంగా పసి కడతాయో వంటి దృశ్యాలను వాటి శిక్షకులు వాటి ద్వారా ప్రదర్శించారు. ముఖ్యంగా డాగ్స్ ఐరన్ రింగ్ రౌండ్ లలో జంపింగ్ చేస్తూ వెళ్లిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోలీస్ పాత్రపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఏపీ ఆర్ జెసి కోడిగునహళ్లి రిటైర్డ్ ప్రిన్సిపాల్ వాసుదేవ రెడ్డి అమరులైన పోలీసుల త్యాగాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఎస్పీ తో పాటు అడిషనల్ విష్ణు , డీఎస్పీ లు వాసుదేవన్ , కెవిఆర్ ప్రసాద్, ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ , ఎస్‌బి సిఐ రవీంద్రారెడ్డి, సిఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలోనే రైతులకు లబ్ధి

రొద్దం : వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి అన్ని విధాలా ఆదుకుందని ఎంపిపి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలో 'వైఎస్ఆర్ జలకళ' కింద ప్రప్రథమంగా బోరు వేసిన రైతులు గొనిమేకలపల్లి మాల శ్రీనివాసులు, పెద్దిపల్లి నరసింహారెడ్డిలకు సోమవారం ఎంపిపి మోటార్ పంపు సెట్, స్టార్టర్, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఐదెకరాల లోపు ఉన్న రైతులకు 'వైఎస్ఆర్ జలకళ' కింద బోరు, మోటారు పంపు, విద్యుత్ సర్వీస్, ఇలా అన్ని ఉచితంగా అందించిందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ ఆనంతాచారి, ఎపిఒ రషీద్, స్వచ్ఛాంధ్ర స్టేట్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, జెట్టి మారుతిరెడ్డి, రాజారెడ్డి, రాజగోపాలరెడ్డి, కన్వీనర్ బోయ తిమ్మయ్య, ఆర్ఎ.రవిశేఖర్‌రెడ్డి, సానిపల్లి సర్పంచి పరమేష్, రెడ్డిపల్లి సర్పంచి రామంజి, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మోటార్ పంపుసెట్ అందజేస్తున్న ఎంపిపి చంద్రశేఖర్

'స్పందన'కు అధికారుల డుమ్మా

గాండ్లపెంట : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. తహశీల్దార్, ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇ, ఎపిఎం, ఎపిఒ, సిరికల్చర్ అధికారి, అంగన్వాడి సూపర్వైజర్ మినహా మిగిలిన శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజాసమస్యలపై అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని రైతు సంఘం నాయకులు మండల కేకే రాజారెడ్డి, ఖాదర్‌బాషా, గంగన్న తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో సర్వే నెంబర్ 120-8లోని పొలంలో అధికారులు సోమవారం పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఓబిరెడ్డి, మండల గణాంక అధికారి డాక్టర్ లక్ష్మీనరసింహ, ఎంపిఇఒ రవికుమార్, విఆర్‌ఎ నారాయణస్వామి, రైతు విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ బీమా అందజేత

గాండ్లపెంట : మండల పరిధిలోని తుమ్మలబైలు పంచాయతీలోని గరుగుతండాకు చెందిన నాగలక్ష్మమ్మ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతిచెందింది. దీంతో సోమవారం మృతురాలి కుటుంబసభ్యులకు వైఎస్‌ఆర్ బీమా కింద రూ.. 10వేలను ఎంపిపి జగన్మోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి బి. రవీంద్ర నాయక్, సింగల్ విండో డైరెక్టర్ రాజన్న, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

బత్తలపల్లి : మండలంలోని అప్పరాచెరువు గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో జలజీవన్ మిషన్ కింద రూ. 28 84లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ బగ్గిరి త్రివేణితో పాటు సర్పంచు మొర్రెడ్డిగారి శారదమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పరాచెరువు గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, కార్యదర్శి మంగమ్మ, వైసిపి మాజీ మండల కన్వీనర్ బగ్గికి బయపరెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, బాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై అప్రమత్తత అవసరం

బత్తలపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో మాతా శిశు మరణాల పట్ల ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ సెల్వియా సాల్మన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లుకు మాత శిశు మరణాల నివారణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గంగిరెడ్డి, పోగ్రాం ఆఫీసర్ కీర్తి కిల్కారి, వైద్యాధికారి రామకృష్ణ, సూపర్ వైజర్లు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

కదిరి టౌన్ : పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ నజీమున్నీసా సాదిక్ అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు, సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

కంటి జాగ్రత్తలు అవసరం

ధర్మవరం టౌన్ : కళ్లపట్ల విద్యార్థులందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని కంటి వైద్యాధికారి ఉరుకుందప్ప తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని నెహ్రూ నగర్ మున్సిపల్ హైస్కూల్లో కంటి చూపు పూర్తిగా మందగించిన ఆరుగురు విద్యార్థులకు హెడ్మాస్టర్ నాగేంద్ర, కౌన్సిలర్ కత్తే ఆదిలక్ష్మి, వార్డు ఇన్‌ఛార్జి కత్తే పెద్దన్న చేతుల మీదుగా ఉచితంగా అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యురాలికి అవార్డు

హిందూపురం : పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్యురాలుగా విధులు నిర్వహిస్తున్న శ్రీ క్రాంతి ఈనెల 28న హైదరాబాద్ లోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డును అందుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం మాట్లాడుతూ వైద్యవృత్తిలో తాను చేస్తున్న సేవలను గుర్తించి ఏసీటీ నౌ సోషల్ ఆర్గనైజేషన్ సెంటర్ వారు అవార్డు అందించి సత్కరించడం సంతోషంగా ఉందన్నారు.

హెన్రీ డ్యూ నాంట్ సేవలు చిరస్మరణీయం

ధర్మవరం టౌన్ : హెన్రీ డ్యూ నాంట్ సేవలు చిరస్మరణీయమని ఇండియన్ రెడ్ క్రాస్ ధర్మవరం శాఖ చైర్మన్ డాక్టర్ నరసింహులు, శ్రీ సత్య సాయి జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్, కార్యదర్శి శివయ్య, కోశాధికారి డాక్టర్ సత్య నిర్ధారన్ తెలిపారు. ప్రపంచ రెడ్ క్రాస్ సంస్థ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూ నాంట్ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ హేన్రీ డ్యూనాంట్ మానవతావాది, సామాజికవేత్త, రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు కావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. తల సేమియా వ్యాధిగ్రస్తులకు, రక్తం అవసరమైన వారికి రెడ్ క్రాస్ సంస్థ ద్వారా సహాయ సహకారాలను అందిస్తామని వారు తెలిపారు.

ప్రభుత్వ భూముల కబ్జాకు యత్నం

ఆక్రమణదారులపై చర్యలకు నిర్వాసితుల డిమాండ్

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలోని షుగర్ ఫ్యాక్టరీ భూముల వ్యవహారంపై కోర్టుల ద్వారా భూ నిర్వాసిత రైతులు పోరాటాలు చేస్తుంటే ఆ భూముల్లో ఉన్న ప్రభుత్వ భూమిని సైతం ఆక్రమించుకునేందుకు యాజమాన్యం పలు ప్రయత్నాలు చేస్తోందని, కోర్టు పరిధిలో ఉన్న ఈ ఆంశంపై జోక్యం చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని భూ నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. మడకశిర రోడ్డు రహదారికి పక్కన ఉన్న సర్వేనెంబర్ 368/2లోని 3.5 ఎకారాల ప్రభుత్వ భూమినిషుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమణకు పాల్పడుతోందని వాపోయారు. గతంలో ఈ ప్రభుత్వ భూమి ప్రభుత్వానికి అందాలన్న ఉద్దేశంతో రెవెన్యూ అధికారులు బండలు నాటి సరిహద్దులను వేశారన్నారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లను తొలగించి సరిహద్దులను చెరిపే ప్రయత్నాలు చేశారని అన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భూ నిర్వాసిత రైతులు కోరారు. రహదారికి ప్రక్కగా ఉన్న ఈ భూమిని కలుపుకొని షుగర్ ఫ్యాక్టరీ భూములను విలువ పెంచాలని చూస్తున్నారని ఈ భూమిని ప్రభుత్వం అయినా తీసుకోవాలని లేదా దీనిని గతం నుండే సాగు చేస్తున్న రైతులకన్నా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అయితే బండరాళ్లను తొలగించిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎస్ఐ నరేంద్ర హామీ ఇచ్చారు.



ప్రభుత్వ భూమిలో పాతిన రాళ్లను తొలగించిన దృశ్యం

పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించండి

ధర్మవరం టౌన్ : తనకు పట్టాదారు పాసుపుస్తకం చేయకుండా రెవిన్యూ అధికారులు గత మూడేళ్లగా తిప్పుకుంటున్నారని తుంపర్తి గ్రామానికి చెందిన తిమ్మక్క ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆమె సోమవారం స్థానిక ఆర్డీవో రమేష్‌రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించింది. అనంతరం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ తన పొలం మల్లకాల్వ పరిధిలో సర్వేనెంబరు 26-2ఏలో 4.98 ఎకరాలు ఉంది. తన భర్తకు ఇద్దరు భార్యలు ఉన్నారని చెప్పారు. తన భర్త రామయ్య, మొదటి భార్య లక్ష్మీదేవి మృతిచెందారని తెలిపింది. అయితే ఈ భూమి మొదటి భార్య లక్ష్మీదేవి పేరుమీద ఉందని ఆ భూమిని తన పేరుమీద చేయాలని మూడేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోలేదని వాపోయింది. ఈ భూమిని తన పేరిట చేయించడానికి తమ కుటుంబంలో ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేకున్నప్పటికీ అధికారులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయకపోతే తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తానని ఆమె హెచ్చరించింది.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం మార్పు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కొత్తపేట రోడ్డులో గల సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని స్థానిక కాయగూరల మార్కెట్ పై గల అంతస్తుల రూముల్లోకి మార్చిన నేపథ్యంలో ఆ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు సబ్ రిజిస్ట్రార్ రమణ రావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టాలని జర్నలిస్టుల సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. చట్టం ప్రకారం స్వేచ్ఛగా సమాచారాన్ని ప్రజలకు అందజేసేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రక్షణ చట్టం రూపొందించి అమలు చేయాలన్నారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పుల్లయ్య, రంగారెడ్డి, జయానంద రెడ్డి, వర్కింగ్ జర్నలిస్టులు టిసి.గంగాధర్, షేక్షావలి, పసలచంద్ర, గూడా శీన, గోవిందప్ప, రాజా, వెంకటరమణా నాయక్, బ్రహ్మయ్య , రమణ,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కదిరి టౌన్ : నల్లచెరువు మండలం సానే వారిపల్లి లో దళితుల పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బీఎస్పీ నాయకులు సురేంద్ర నాథ్ బెనర్జీ డిమాండ్ చేశారు. ఈ మేరకు కదిరి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన సోమవారం పరామర్శించారు. కదిరి డివిజన్ పరిధిలో దళితుల మీద దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆస్థాన అభివృద్ధికి సహకారం అందిస్తాం

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక



ఉత్సవాల సందర్భంగా మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి దీపిక



ఖావాలి ఆలపిస్తున్న సల్మాన్, ఆఫ్రీన్ బృందం

ప్రజాశక్తి-హిందూపురం

లేపాక్షి మండలం నాగేపల్లి వద్ద వెలసిన హజ్రత్ పీర్ భక్తర్ వలి ఆస్థాన అభివృద్ధికి తమ వంతుగా అన్ని విధాలా సహకారం అందిస్తామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక హామీ ఇచ్చారు. శుక్రవారం రాత్రి ప్రారంభమైన ఉరుసు ఉత్సవాలు ఆదివారం ప్రత్యేక ఖవాలి కార్యక్రమంతో ముగిశాయి. ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త, ఇన్‌ఛార్జి దీపిక పాల్గొనిప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దీపిక మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా నిర్వహించుకుంటున్న ఉరుసు ఉత్సవాల వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆస్థాన కమిటీ నిర్వాహకులు ఆస్థాన అభివృద్ధికి సహకారం అందించాలని కోరగా విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక నిధులను మంజూరు చేయించి తన వంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం దర్గా కమిటీ నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ముక్తియార్, శ్రీనివాస్ రెడ్డి, షరీఫ్, వెంకటరమణప్ప, సమీవుల్లా, నరసింహ, సందీప్, ఆదిరామారెడ్డి, కిష్టప్ప, బాబాజాన్, మహబూబ్ దౌల, డాక్టర్ వారీస్ వుల్లా తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేణురెడ్డి

పట్టు రైతుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ రైతులతో పాటు పట్టు రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక వైసిపి ఇన్‌చార్జ్ దీపిక భర్త వేణురెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం విజయవాడలో మంత్రిని కలిసి రైతుల సమస్యలను వివరించారు. ఇదివరకు పట్టు రైతులకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ప్రోత్సహాకాలు ఇచ్చేదన్నారు. అయితే గత కొంత కాలంగా ప్రోత్సహాకాలు విడుదల చేయడం లేదని దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని అన్నారు. వెంటనే పెండింగ్‌లలో ప్రోత్సహాకాలు ఇవ్వడంతో పాటు రైతుల సమస్యలను పరిష్కంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి నియోజకవర్గంలోని రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఉమ్మడి పోరాటం కొనసాగిస్తాం

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదిరి నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలపై టిడిపి జనసేన అధ్వర్యంలో కలిసికట్టుగా ఉమ్మడి పోరాటాలు కొనసాగిస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కందికుంట నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం రెండు పార్టీలు పొత్తు పెట్టుకున్నాయన్నారు. అందులో భాగంగా రాష్ట్ర, జిల్లా నాయకుల అధ్వర్యంలో ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చేశారని ఆదివారం ఇరుపార్టీల అధ్వర్యంలో ఉమ్మడి సమావేశం అనంతపురంలో జరిగిందని అన్నారు. ఈ నేపథ్యంలో కదిరి పట్టణంలో మంగళవారం టిడిపి జనసేన ఉమ్మడి సమావేశం తాయి గ్రాండ్ నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన పట్టణ అధ్యక్షులు ఇర్ఫాన్, కాయల చలపతి, నాయకులు రాజశేఖర్ బాబు, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

పౌరహక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మడకశిర తహశీల్దార్ హసీనాసుల్తానా



ధర్మవరంలో అవగాహన కల్పిస్తున్న సిఐ సుబ్రమణ్యం

ప్రజాశక్తి-మడకశిర

పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం రొళ్ల మండల పరిధిలోని కాకి గ్రామం ఎస్సీ కాలనీలో ఎంపిటిసి లక్ష్మి ఆధ్వర్యంలో పౌర హక్కుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహశీల్దార్ హసీనా సుల్తాన్ హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్, ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లు, ఇతర సదుపాయాలపై అవగాహన కల్పించారు. కుల వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. యువత తమ హక్కులపై సంపూర్ణంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రచన, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రొద్దం : పౌర హక్కులపై మండల పరిధిలోని కలిపి ఎస్సీ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంతాచారి, వ్యవసాయ అధికారి నివేదిత, ఎస్ఐ వలిబాషా, తదితరులు పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌరహక్కులపై అవగాహన కలిగి, వాటి విలువలను కాపాడాలని సూచించారు.

పరిగి : మండలంలోని హొన్నంపల్లి గ్రామంలో అధికారులు సోమవారం పౌర హక్కుల దినోతవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎస్ఐ నరేంద్ర గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కాలనీలలో గ్రామస్తులతో కలిసి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి శివ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ప్రజల హక్కులను తెలుసుకుని ప్రశాంతంగా జీవించాలని వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని జగజ్జీవన్ రామ్ నగర్ లో సోమవారం రాత్రి పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా వార్డు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టపరిధిలో జీవించాలన్నారు. ప్రతిఒక్కరూ పౌరహక్కులను తెలుసుకుని సమాజంలో ప్రతిఒక్కరితో స్నేహపూర్వకంగా మెలగాలని శాంతియుతంగా జీవించాలని సూచించారు.

కొత్తచెరువు : గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు మండల పరిధిలోని మైల్ సముద్రం గ్రామంలోనే ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ హక్కులు విధులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి ధర్మవరం టౌన్



పద్మావతి (ఫైల్‌ఫొటో)

అత్తింటి వేధింపులతో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం పట్టణంలోని బాలాజీనగర్‌లో చోటు చేసుకుంది. ఈఘటనకు సంబంధించి టూటౌన్ సిఐ అశోక్ కుమార్, మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు... బాలాజీనగర్‌కు వెంకటరాముడుకి కల్లూరు గ్రామం ఎగువపల్లికి చెందిన వెంకటాద్రి, వెంకటలక్ష్మీ దంపతుల రెండవ కుమార్తె పద్మావతిని ఇచ్చి పదేళ్లక్రితం వివాహం చేశారు. వెంకటరాముడు, ఆయన భార్య పద్మావతి చీరలు పాలిస్, మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. వీరి కాపురం మూడేళ్లు సాఫీగా సాగింది. ఆ తరువాత ఇంటిలో ఏదో విషయంపై తరచూ పద్మావతికి వేధింపులు మొదలయ్యాయి. అంతేకాకుండా పద్మావతిని పుట్టింటికి వెళ్లనివ్వకుండా, వారిని ఇక్కడికి రానివ్వకుండా చేశారు. ఈ క్రమంలో వేధింపులు తాళలేక పుట్టింటికి వారికి చెప్పుకోలేక పద్మావతి మనోవేదనకు గురయ్యేది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పద్మావతి చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న టూటౌన్ సిఐ అశోక కుమార్ తన సిబ్బందితో సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు ధర్మవరం వచ్చి తమ కూతురు మృతికి ఆమె భర్తతో పాటు అత్త, మామ, ఆడబిడ్డ కారణమని ఆరోపించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

బుక్కపట్నం : విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పాముదుర్తి గ్రామంలో నెలకొంది. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాలు... గ్రామానికిచెందిన యువ రైతు బాబావలి తన పొలంలో మల్లెపూల మొక్కలను పెంచుతున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం మూడు గంటల సమయంలో మల్లెపూల మొక్కలకు నీరు పెట్టడానికి వెళ్లి విద్యుత్ స్టార్టర్ ఆన్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. సాయంత్రం అయినప్పటికీ బాబావలి ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య కుటుంబ సభ్యులు బావి దగ్గరికి వెళ్లి చూశారు. అక్కడ విగతజీవిగా పడిఉండటాన్ని గమనించి కన్నీరుమున్నీరు అయ్యారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఐచర్ బోల్తా.. వ్యక్తి మృతి

సోమందేపల్లి : టమోటా లోడుతో వెళ్తున్న ఐచర్ వాహనం జాతీయ రహదారిపై బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకొంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు.. పావగడకు చెందిన రైతు రమేష్‌నాయక్(40)ఐచర్‌లో టమోటాలు లోడు చేసుకొని కర్నాటకలోని బాగేపల్లి వెళ్లాడు. అక్కడ టమోటాలు విక్రయించి తిరిగి పావగడకు బయల్దేరారు. ఈ క్రమంలో మండల పరిధిలోని నల్లగొండరాయునిపల్లి వద్దకు రాగానే 44వ జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రమేష్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్ సునీల్‌నాయక్, క్లీనర్ చిన్న నాయక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని బెంగళూరుకి తరలించినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గాండ్లపెంట : మండల పరిధిలోని మద్దివారిగొంది పంచాయతీలోని కోటపల్లి చెందిన మిద్దె లక్ష్మీనారాయణ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. లక్ష్మినారాయణ అనారోగ్యంతో బాధపడుతుండేవాడని కదిరి, అనంతపురం, మదనపల్లి పట్టణాలలో చికిత్స చేసిన ప్రయోజనం కన్పించలేదన్నారు. శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో కుటుంబ సభ్యులు అనంతపురం తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మినారాయణ మృతిచెందాడని ఎస్ఐ చెప్పారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి : జనసేన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలో నెల 20న తమ పార్టీ నాయకుడు రాజారెడ్డిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా ఎస్పీ మాదవరెడ్డికి వినతిపత్రం అం దజేశారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు ధర్మవరంలో జరిగే అవకాశాలు ఉన్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి అబ్దుల్ అబు, కొత్తచెరువు మండల అధ్యకులు పూలశివప్రసాద్, కమిటి సభ్యులు రామాంజి, ఆది, సుధాకర్ రెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించండి

ధర్మవరం టౌన్ : పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని 28 వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సరితాల బాషా టూటౌన్ సిఐ అశోక్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు సరితాల బాషా సోమవారం స్థానిక టూ టౌన్ సిఐను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సరితాల భాష మాట్లాడుతూ 28 వ వార్డు కేతిరెడ్డి కాలనీచ కొంతమంది ఆకతాయిలు, అల్లరిమూకలు మద్యం, గంజాయి సేవిస్తూ స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. రాత్రిపూట గస్తీని ఏర్పాటు చేసి అల్లరిముకలా ఆటలు కట్టించాలని సిఐను కోరారు. స్పందించిన సిఐ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడాపురం అశోక్, గోపన సూరి, రామ్మోహన్‌నెడ్డి, గోపాల్, చౌడయ్య, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



సిఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-రొద్దం

రొద్దంకు చెందిన విశ్రాంత విఆర్‌ఒ నీరుగంటి రామకృష్ణప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో సోమవారం టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారథి వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రొద్దం నరసింహులు, నరహరి, వాల్మీకి, అశ్వర్థనారాయణ, హరీష్, మురళి, ఇమాం, రుద్ర, వెంకీ, రాము, పవన్‌కుమార్, రాజప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


ప్రజాశక్తి-అమరాపురం

అమరాపురంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌లో కొలువు దీర్చి బోయ కాలనీ నుంచి డప్పు వాయిద్యాల మధ్య టపాసులు పేలుస్తూ గ్రామవీధుల గుండా బస్టాండ్ వరకూ ఊరేగించారు. వాల్మీకి సామాజికవర్గం ప్రజలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రంథం ఆవిష్కరణ

ప్రజాశక్తి-రొద్దం

శ్రీమద్వేదాంత దేశికులు సంస్కృతంలో రాసిన ఆంధ్ర పాదుకా సహస్రాన్ని తెలుగులోకి అనువదించిన వింజమూరి శేషఫణిశర్మ గ్రంథాలను సోమవారం మండల పరిధిలోని కోగిర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నారాయణరెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జాబిలి చాంద్‌బాషా మాట్లాడుతూ వేదకాలం నాటి సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక స్థితిగతులను ఈ గ్రంథంలో వివరించారన్నారు. ఈ పుస్తకాలు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల తెలుగు అధ్యాపకులు సత్యనారాయణ, దీప్తి పాఠశాల హెచ్‌ఎం చింతకాయల శ్రీనివాసులు సహకారం తో వివిధ పాఠశాలలు, గ్రంథాలయాలకు వంద గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్, పోతులయ్య, హసీనబాను, రమేష్, శివయ్య, రామాంజనేయులు, ఆదినారాయణ, శ్రీదేవి పాల్గొన్నారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం